క్లుప్తంగా

బీజేపీ జాతీయ కన్వెన్షన్‌కు జిల్లా నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో రెండు రోజులపాటు జరగనున్న జాతీయ కన్వెన్షన్‌కు జిల్లా బీజేపీ నాయకులు తరలివెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి నాయకత్వంలో శనివారం వారు ఢిల్లీ చేరుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, కార్యవర్గసభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, పనతుల సురేష్, రాజేష్‌రెడ్డి, గజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు.

సామాజిక సేవ అభినందనీయం



వృద్ధులకు సరుకులు అందజేస్తున్న ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగులు సామాజిక సేవలో భాగస్వామ్యం అవడం అభినందనీయమని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్(ఆపరేషన్స్) ఎస్ఈ రమణ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆజాద్ నగర్‌లో బృందా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి రూ.30 వేలు విలువగల నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఈ రమణ ముఖ్య అతిథిగా హాజరై సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ప్రెసిడెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు, జనరల్ సెక్రెటరీ చలపతి, ఫయాజ్ బేగ్, రఘు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణదేవ, శివ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



హజరతయ్యను సన్మానిస్తున్న అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న తెలుగు అధ్యాపకులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు బాధ్యులు హజరతయ్య సేవలు అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం కళాశాలలో హజరతయ్యను అతిథులు, క్రీడావిద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజరతయ్యకు బోధన, క్రీడలపట్ల చక్కటి అవగాహన ఉండడం వల్ల కళాశాలలో మంచి క్రీడాకారులు తయారవుతున్నారన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ మాట్లాడారు. అనంతరం హజరతయ్యను సన్మానించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వెంకటలక్ష్మి, డాక్టర్ వెంకటసుబ్బయ్య, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులు, క్రీడావిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీహెచ్ వినోద్

కడప కార్పొరేషన్: అనంతపురం జిల్లా, రాప్తాడు నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించనున్న 'సిద్ధం' బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి కలిగిందన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె. బాబు, శ్యాంసన్, లక్ష్మీనారాయణ, చిట్టిబాబు, బండి రమణ, శ్రీనివాసులు, ఎం. సుబ్బ రాయుడు, గంగయ్య, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

కార్మికులను దుర్భాషలాడిన సెక్రటరీలపై చర్యలు తీసుకోవాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 44, 45, 46, 41 డివిజన్లలో మేస్త్రీలు, కార్మికులను దుర్భాషలాడుతున్న శానిటరీ సెక్రటరీలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్. రవి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక చెమ్ముమియ్యాపేట సచివాలయం వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. చంద్రశేఖర్ వారితో చర్చలు జరిపారు. జరిగిన సంఘటనలపై విచారించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



విద్యార్థుల సైన్సు ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

● సృజనాత్మకత

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని దుబాయ్ జీనియస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో నిర్వహించిన సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు ప్రదర్శించిన పలు సైన్సు నమూనాలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీసీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు హరూన్ అహ్మద్‌బాష, తోటక్రిష్ణ, జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, మియ, శివానాయక్ తదితరులు పాల్గొన్నారు. -కడప ఎడ్యుకేషన్

● ఎయిడ్స్‌పై అవగాహన



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ, ఇతర అధికారులు

జిల్లాలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కడప విభాగం ద్వారా కళాజాత బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు తెలిపారు. శనివారం ఆయన తమ కార్యాలయంలో జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈనెల 17 నుంచి 29 వరకు 25 ప్రదర్శనలను ఇస్తారన్నారు. జిల్లాలో రెండు కళాజాత బృందాలతో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి, రక్తదానం, సుఖవ్యాధుల ఐసీటీసీ కౌన్సిలింగ్ కేంద్రాల గురించి, క్షయ వ్యాధుల సంబంధం గురించి వీధి నాటకాల ద్వారా వివరిస్తారన్నారు. – కడప కోటిరెడ్డిసర్కిల్

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



పార్కులో మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. శనివారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన ఈట్ స్ట్రీట్, అక్కాయపల్లె పార్కు, శాస్త్రి నగర్ పార్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈట్ స్ట్రీట్‌లో బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రతిరోజూ ఫౌంటేన్ ఆన్ చేయాలన్నారు. పార్కింగ్ లైట్లు ఏర్పాటు చేసి, రోలింగ్ చేయించాలన్నారు. అక్కాయపల్లె పార్కులో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పలుచోట్ల మొక్కలు నాటించాలని సూచించారు. మరుగుదొడ్ల వద్ద సైనింగ్ బోర్డులు ఏర్పాటు చేసి, ఎలక్ట్రిక్ దీపాలు అమర్చాలన్నారు. శాస్త్రి పార్కులో మొక్కలు నాటించాలని సూచించారు. పార్కుకు వచ్చిన ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేలా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్, హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

20వ తేదీన మటన్, చికెన్ షాపులకు వేలం

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో ఉన్న మటన్, చికెన్ షాపుల బాడుగ వసూళ్లకు సంబంధించిన వేలం పాటను ఈనెల 20వ తేదీన మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని సుమారు 19 మటన్, చికెన్ షాపులు ఉన్నాయి. వీటిలో పాత మటన్ షాపులకు నెలకు రూ.4500, పాత చికెన్ షాపులకు నెలకు రూ.4000, నూతనంగా తాత్కాలిక చికెన్ షాపులకు నెలకు రూ.5000 బాడుగను నిర్ణయించామన్నారు. ఈ వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.2 లక్షలు చెల్లించాలన్నారు. ఈ వేలం పాటను దక్కించుకున్న టెండర్ దారుడికి 2025 వరకు గడువు ఉంటుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వైవీయూలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె మండలం శివాజీనగర్‌లో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా ప్రిన్సిపాల్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం వైవీయూలో గాంధీపార్కులో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. కె. శ్రీనివాసరావు, డా. సుమిత్ర, వలంటీర్లు పాల్గొన్నారు.

డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ ఆధ్వర్యంలో..

కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అలంఖాన్‌పల్లె గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి. రమాదేవి మాట్లాడుతూ మొక్కల పెంపకం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకం



పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ పొందిన విద్యార్థులు

వైవీయూ: పుట్టగొడుగుల పెంపకం లాభదాయకమని వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుట్టగొడుగుల పెంపకంను అనంతపురం జిల్లా ఎస్.ఎస్.బి.ఎన్. డిగ్రీ కళాశాల విద్యార్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మార్కెట్ విలువ ఉండే పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో గ్రామీణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల పెంపకాన్ని చిన్నతరహా పరిశ్రమగా ప్రారంభించవచ్చని సూచించారు. బయోటెక్నాలజీ శాఖ ఆచార్యులు డా. చంద్రమతీశంకర్ మాట్లాడుతూ పుట్టగొడుగుల పెంపకం ప్రాథమిక దశ నుంచి మార్కెటింగ్ వరకు ప్రయోగాత్మకంగా శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనంతపురం డిగ్రీ కళాశాల అధ్యాపకులు హరీష్, మురళీ, కుమార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

కడప అగ్రికల్చర్: ట్రాన్స్‌జెండర్స్‌కు ఓటు హక్కుపై జిల్లా వ్యవసాయ అధికారి, స్వీప్-2024 నోడల్ అధికారి అయితా నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల సందర్భంగా ఓటు ఎలా వినియోగించుకోవాలనే అంశంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి కడప నగరంతోపాటు నగర శివార్లలోని ట్రాన్స్‌జెండర్స్‌ను కలిసి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటు ఒక ఆయుధం అనే అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారి మొబైల్ ఫోన్లలో సి విజిల్, ఓటర్ హెల్ప్‌లైన్, సాక్ష్యం-ఈసిఐ యాప్‌లను డౌన్‌లోడ్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ కార్యాలయ ఏఓ నాగభూషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్స్‌కు ఓటుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

అక్షరమే అన్నితరాలకు జ్ఞానప్రదాత



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

కడప కల్చరల్: అక్షరమే అన్ని తరాలకు జ్ఞానప్రదాతగా నిలుస్తుందని వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని గ్రాండ్‌ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ ఆధ్వర్యంలో ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి అధ్యక్షతన పూర్వ కో కన్వీనర్ డా. పాలెం వేణుగోపాల్ రచించిన 'విస్మృత స్వాతంత్ర్య ఉద్యమ సంగతులు' పుస్తకాన్ని ఆచార్య ఈశ్వరరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలకు జ్ఞానాన్ని అందించేవి అక్షరాలేనని, ఇలాంటి పుస్తకాలతో పుస్తక ప్రదాతలు చిరంజీవులు అవతారని, కొనియాడారు. ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లా వారసత్వ సంపద రక్షణకు చారిత్రక సమాచారంతో పుస్తకాలను ప్రచురిస్తున్నామన్నారు. రచయిత స్పందిస్తూ రేపటి తరం స్వాతంత్ర్యస్ఫూర్తిని, చరిత్రను బాలలు సైతం అర్థం చేసుకునేందుకు ఈ పుస్తకం తీసుకువచ్చామన్నారు. పూర్వ కన్వీనర్ ఎలియాస్‌రెడ్డి , మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి , ఇంటాక్ సభ్యులు రాణీ, వైవీయూ జర్నలిజం శాఖ అధ్యాపకులు డా. తుమ్మలూరు సురేష్‌బాబు, న్యాయవాది సట్టి భారవి కూడా మాట్లాడారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు కొండూరు జనార్ధన్‌రాజు, భోగాల కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

● స్నాతకోత్సవం



విద్యార్థులకు కాన్వొకేషన్ పట్టాలను అందజేస్తున్న కరస్పాండెంట్, డైరెక్టర్లు

కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్లో రినైజాన్స్-2024 పేరిట పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవిలు ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న చిన్నారులకు కాన్వొకేషన్ పట్టాలను అందచేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. -కడప ఎడ్యుకేషన్

పెద్ద శేషవాహనంపై శ్రీవేంకటరమణుడు



పెద్ద శేషవాహనంపై శ్రీవేంకటరమణుడు

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన వేంకటరమణుడి ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్న శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామివారు పెద్ద శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక వాహనంలో స్వామివారిని రకరకాల పూలతో అలంకరించి పట్టణం పురవీధులైన మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్, గంగిరెడ్డి ఆసుపత్రి రోడ్డు, ముత్యాల వారి వీధి, గాడిచర్ల వీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. తమ ఇంటి ముంగిటకు స్వామివారు రాగానే భక్తిశ్రద్ధలతో భక్తులు కాయ, కర్పూరం, నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఉదయం సుప్రభాత సేవ.. తోమాల సేవతోపాటు ధ్వజారోహణం చేపట్టారు. సాయంత్రం సహస్రనామార్చన, నివేదన, యాగశాల ప్రవేశం, పుణ్యాహక వాచనం, నిత్య హోమం, వాస్తు హోమంతోపాటు తదితర పూజలు నిర్వహించారు. ఉభయ దారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరన ఊంజల్ సేవలు నిర్వహించి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.